# గుడ్‌బై

ఎం.వెంకటేశ్వరరావు

''సుహాసినీ!

**కోపిష్టివాళ్ల శాపాన్నైనా భరించవచ్చేమోగానీ అసూయాపరుడి ఆదరణకు ఆమడ దూరంలో వుండాలన్న జీవిత సత్యాన్ని చాలా ఆలస్యంగా తెలుసుకున్నాను. పేరుకు పొంతనలేని అందం, ఐశ్వర్యం నీకిచ్చి రాగద్వేషాలు రంగరించి నీలో పొందు పరచాడేమో ఆ బ్రహ్మ. మనల్నిద్దర్నీ భార్యాభర్తలుగా కలపడంలో పొరబడ్డాడేమో!**

కారులో కాలేజీకొచ్చే నిన్ను నాకు పరిచయంచేసిన నందితను నీ జ్ఞాపకాల్లోంచి తుడిచేసుంటావు. అప్పుడు నా పరిచయాన్ని నీ రికార్డు వర్కు కు ఉపయోగించుకుని అప్పుడప్పుడు ఆర్థికంగా ఆదుకునేదానివి.

విధి వక్రించి మా నాన్న మరణించడంతో నా చదువు మధ్యలోనే కుంటుబడ కుండా ఆర్థికంగా ఆసరా ఇచ్చిన నీపై నాలో కృతజ్ఞతాభావం పెరగసాగింది. ఫైనల్ ఇయర్‌లో నందిత ఆత్మహత్య అర్థం కాక పోయినా మంచి స్నేహితురాలు పోయిందన్న ఫీలింగ్ మనసును తొలుస్తుండేది. మెడిసిన్ మంచి రాంకుతో పాసయిన నాతో నువ్వు మన పరిచయానికి ప్రణయపు భాష్యం చెప్పేసరికి భయపడ్డాన్నేను.


మన అంతస్తుల్లో అంతరాలు వద్దని వారిస్తున్నా, నా అభిప్రా యాన్ని పైకి రానీయకుండా నువ్వు చేసిన సహాయానికి నా కృతజ్ఞతను కట్టిపడేసి నన్ను నీ భర్తగా మార్చుకున్నావు.

మీ నాన్నగారు మన కోసం 'సారీ'... నీ కోసం కట్టించిన నర్సింగ్‌హోమ్‌లో లోకానికి ఆయన అల్లుడి హోదాలో ప్రాక్టీస్ ప్రారంభించినా పంజరం లో చిలకలా బందీ అయ్యానని అనతికాలంలోనే తెలుసుకు న్నాను.

రెండేళ్లపాటు శరీరతాపాలు చల్లార్చుకున్న మన ప్రణయానికి అంతరాలు అగుపించసాగాయి. అర్థంపర్థంలేని నీ కోపం, ప్రతి పనికీ స్టేటస్ ప్రదర్శించే నీ డబ్బు, దర్పం నన్ను కించపరుస్తున్నా సరిపెట్టుకున్నా కృతజ్ఞతకు కట్టుబడి నా తోబుట్టువులకు ఏ సహాయం చేయాలన్నా నువ్విచ్చే పర్మిషన్ కోసం ఎదురు చూడాల్సిన దుస్థితి ఏర్పడింది. చివరికి నా తమ్ముడికి ఇంజనీరింగ్‌లో సీటు దొరికినా అరపైసా కూడా అందించలేని ఆర్థిక అస్వస్థతకు నన్ను లోను చేసావు.

నా సంపాదనంతా నీ సొంతంచేసి నీ భర్తగా మీ ఇంటల్లుడిగా కార్లలో తిరుగుతూ సొసైటీలో పెరుగుతున్న ఫాల్స్ స్టేటస్‌కు సంతోషించాలో, బాధపడాలో తెలియని స్థితికొచ్చేసాను నేను.

ఒకే వృత్తిలో వున్న మనకు నాకు పేరు ప్రఖ్యాతులు పెరగడం నీలోని ఇగో



రాన్రానూ అధికం కాసాగింది.

చివరికి నువ్వు నా భార్యవన్న విషయాన్నే విస్మరించేలా చేసింది.

నువ్వు లేని సమయంలో స్వచ్ఛంద సేవా సంస్థలకిచ్చిన విరాళాన్ని వాళ్ల సావనీర్‌లో నా పేరుతో ప్రచురిస్తే అది చూసి భరించలేని నీ ఇగో వాళ్లను పిలిచి నా పేరుతోపాటు నీ పేరూ సావనీర్‌లో వెయ్యాలని పట్టుబట్టి మార్పించడంలాంటి నీ వింత చేష్టలు చూస్తుంటే నీలోని అసూయ వెర్రితల వేస్తోందని భయమేస్తోంది.

నీలోని అసూయ నువ్వు బాధ్యతగల డాక్టరువన్న విషయాన్ని నీకు గుర్తులేనంతగా నిన్ను మార్చి నీ నిర్లక్ష్యానికి కొన్ని ప్రాణాల్ని బలి తీసుకున్నా నోరు మెదిపే అర్హత లేకుండా చేసావు.

ఒకటా రెండా! ఇలాంటివి నిత్యం సహజమయ్యాయి.

భార్యాభర్తల మధ్య సహజంగా పెరగాల్సిన అను రాగానికి బదులు నువ్వు నాపై అసూయాద్వేషాలెం దుకు పెంచుకుంటున్నావో అర్థంకాని ప్రశ్నయింది నాకు.

ఇవన్నీ ఓపిగ్గా భరించిన నాకు నీ బుక్స్ మధ్య దొరికిన లెటరు చూసాక నిన్ను భరించే శక్తి కోల్పోయాను.

ఇన్నాళ్లూ నందిత మరణం ఆత్మ హత్యగానే తెల్సిన నేను ఆమె చివరిగా నాకు రాసిన ఆ లెటరు చూసాక ఆమె ను నీ అసూయే బలి తీసుకుందని అర్థమైంది.

నందితకూ, నాకూ మధ్యస్నేహాన్ని సన్నిహితంగా మారకుండా మా ఇద్దరి స్నేహానికి ప్రణయపు పట్టంగట్టి ఆమె నా బిడ్డకు తల్లి కాబోతుందన్న ప్రచా రంచేసి నా దగ్గర ఆమెను కారెక్టర్‌లేని దానిలా చిత్రించి ఆమెపై నాకున్న సదభిప్రాయాన్ని సమాధి చేసావు.

ఒకే వ్యక్తిలో కోపం, అంతకుమిం చిన అసూయ వుండడం, ఆ వ్యక్తిని నువ్వే అవడం, నువ్వే నా భార్యవు కావడం నా దురదృష్టం. నీ ముందుం డి నీ అసూయకు ఆహుతయ్యేకన్నా ఏ పల్లెకో వెళ్లి ప్రాక్టీస్ చేద్దామన్న నిర్ణయానికి వచ్చాను.

అప్పుడే అందింది బొహరిరన్ నుండి అప్పాయింట్‌మెంట్ ఆర్డర్. విధిరాతనెవ్వరూ తప్పించలేరేమో...!

నీకు తోడు మరో అసూయ ప్రాణిని లోకానికి అందించేందుకు నేను కారణమవడం ఇష్టం లేకనేమో భగవం తుడు నా రూపాన్ని నీలో ప్రాణం పోసుకోకుండా నాకు ఉపకారం చేసాడు.

నీ అసూయకు అందనంత సుదూర తీరాలకు వెళ్లిపోతున్నాను. త్వరలో నీకు డైవోర్స్ పేపర్లు అందుతాయి. హాసంలేని నీ దరహాసానికి శాశ్వతంగా గుడ్‌బై''

ఏర్‌పోర్ట్‌లో లెటరు పోస్టుచేసి కదలడానికి సిద్ధంగావున్న విమానంవైపు వడివడిగా అడుగులేసాడు డాక్టర్ రాజశేఖర్.

★